

# సమస్యలు - పరిష్కారాలు

## - డా.యండమూరి వీరేంద్రనాథ్



సమస్య రాగానే మనం పరిష్కారం ఆలోచించటం మానేసి, విచారించటం ప్రారంభిస్తాం.

సముద్రం ఎంత పెద్దదైనా, నీళ్ళని లోపలికి రానివ్వకపోతే పడవ మునగదు. సమస్య ఎంత పెద్దదైనా, మనసులోకి రానివ్వకపోతే బాధ ఉండదు.

పాతికశాతం సమస్యలు పరిష్కారం లేనివి. పరిష్కారం లేని ఈ పాతిక శాతం గురించీ మనం జీవితంలో సగభాగం ఆలోచిస్తూ గడిపేస్తాం. ఇంకో యాభై శాతం సమస్యలు మనకి ఇతరుల వల్ల వచ్చేవి. అవి తీరాలంటే మారవలసింది వాళ్ళు. మనం కాదు. తాగుబోతు భర్త, దుబారా భార్య, గయ్యాళి అత్తగారు, చెడుదార్లో సంతానం వగైరా. వాళ్ళని మార్చటం ఎలా అని నిరర్థకంగా విచారిస్తూ మరో పాతిక శాతం కాలం గడిపేస్తాం. మిగిలిన పాతిక శాతం సమస్యల్నుంచి బయటపడాలంటే కఠినమైన నిర్ణయాలు అమలు జరపాలి. దురదృష్టవశాత్తూ ఇటువంటి సందర్భాల్లో మనం ఆలోచిస్తూ కూర్చుంటాము తప్ప నిర్ణయాలు తీసుకోము. తీసుకున్నా, అమలు జరపం.

...

ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో, ఆ నిర్ణయాన్ని ఎలా అమలు జరపాలో, ఏ సమస్యకి ఎలాంటి నిర్ణయం తీసుకుంటే సమస్య తాలూకు సాంద్రత తగ్గుతుందో ఆత్మీయంగా చెప్పే పుస్తకం.

బొమ్మలు: డా. జయదేవ్

## ముందు మాట

ఈ పుస్తకంలోని చాలా ప్రశ్నలు నవ్య, సాక్షి మొదలైన పత్రికలలో ప్రచురింపబడినవి. కొన్ని ప్రశ్నలు, సభల్లో ఉపన్యాసం అనంతరం శ్రోతలు అడిగినవి, మరి కొన్ని మిత్రుల మధ్య జరిగిన సంభాషణలో దొర్లినవి. కేవలం రెండు ప్రశ్నలు మాత్రం సమాధానం ఇవ్వటం కోసం సృష్టింపబడినవి.

కొన్ని సమాధానాల్లో కొన్ని కొటేషన్లు, చిన్న చిన్న కథలు, సంఘటనలు, సందర్భాలబట్టి గతంలో వ్రాసిన పుస్తకాల నుంచి పునరుద్ధాటించబడినవి. వీలైనంత ఎక్కువ మంది పాఠకులకు విషయం చేరాలనే ఉదేశంతో వాటిల్ని తిరిగి ప్రస్తావించడం జరిగింది. వీటిని అంతకు ముందే చదివిన పాఠకులకు ఈ పునరుక్తి విషయమై క్షమాపణలు. ఇక్కడ, సమాధానాల కన్నా... ప్రశ్నలు ముఖ్యమని ఉద్దేశ్యం. ప్రస్తుతం యువత ఎలాంటి సమస్యలతో బాధపడుతోందన్న విషయం తెలియజెప్పటంకోసం, జవాబుల్ని పునరుక్తీకరించటం జరిగింది. అదే విధంగా, కాపీ రైట్ లేని ఇంటర్నెట్ బొమ్మలు కొన్ని వాడుకోవటం జరిగింది. ఆ అజ్ఞాత కళాకారులకి కృతజ్ఞతలు.

చివరిగా ఒక మాట.

ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకలా ఉండవు. ఇందులోని కొన్ని అభిప్రాయాలు కొంతమందికి నచ్చకపోవచ్చు. మరి కొందరికి కడుపులో దేవినట్టుగా కూడా అనిపించవచ్చు. ముందే చెప్పినట్టు ఎవరి అభిప్రాయాలు వారివి. దీనికోసం వాదనలు, ప్రతివాదనలు అనవసరం. వాదించేటప్పుడు మనం అవతలి వారిని అర్థం చేసుకోవటానికి వినం. మనం గెలవటానికి వీలుగా జవాబు ప్రిపేర్ చేసుకుంటూ వింటాం. ఇద్దరు రెచ్చిపోయి దీర్ఘంగా వాదించుకుంటున్నారంటే, అందులో ఒకరు మూగ, మరొకరు చెవిటి.

మూగ వాడికి అందరూ చెవిటి వాళ్ళలాగా కనబడతారు. చెవిటి వాడికి ప్రపంచమంతా మూగగా ఉన్నట్టు అనిపిస్తుంది. అర్థం – పర్థం లేని వాదనల పరమార్థం ఇదే.

వాదనలో గెలవటానికి అత్యుత్తమ సాధనం చిరునవ్వు. ఇతరులతో వచ్చే చాలా సమస్యల్ని 'నవ్వు' పరిష్కరిస్తుంది. 'మౌనం' సమస్యల్ని రాకుండా చేస్తుంది.

–రచయిత.

**షేక్ షాషావలి. గుంతకల్లు:**

**నేను డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లయ్యింది. కానీ ఇంతవరకూ ఉద్యోగం సంపాదించలేకపోయాను. దానికి కారణం కూడా నేనే. ఆ కోచింగ్ ఈ కోచింగ్ అంటూ చాలా సమయం వృథా చేశాను. కానీ నేను ఏ రంగానికి సరిపోతానో, ఏ ఉద్యోగంలో నిలదొక్కుకో గలుగుతానో ఇంతవరకూ తెలుసుకోలేకపోయాను. ఈ బలహీనతను ఎలా అధిగమించాలి?**

చాలామంది చేసే తప్పు ఇదే. తొందరగా గ్రహించారు. కంగ్రాట్స్. చదువుకు సరిపడా ఉద్యోగం వచ్చేవరకూ విద్యార్థులు ఖాళీగా ఉంటారు. ఖాళీగా ఉంటున్నానని చెప్పుకోవటం నామోషీ కాబట్టి ఏదో కోచింగ్ సెంటర్లో చేరతారు. అలా కాకుండా ఎంత చిన్న ఉద్యోగమైనా సరే ముందు  చేరిపోయి అంచెలంచెలుగా ఎదగాలి. బాల్యం నుంచే సమయం విలువ బాగా తెలుసుకున్నవాడు త్వరగా ధనవంతుడవుతాడు. ఖాళీగా ఉండటం కన్నా ఏదో ఒకటి చేయటమే గెలుపుకి మొదటి సోపానం.అప్రస్తుతమైనా ఒక అనుభవం వ్రాస్తాను. రోటరీ తరపున ఇండియా వచ్చిన ఒక మిత్రుడిని షాపింగ్‌కి తీసుకు వెళ్ళినప్పుడు, దాదాపు ప్రతీ షాపు ముందూ 'వాంటెడ్ సేల్స్‌బోయ్స్-గర్ల్స్' అన్న బోర్డు చూసి, "ఇన్ని ఉద్యోగాలుండగా మీ దేశంలో ఇంత నిరుద్యోగ సమస్య ఏమిటి?" అని అడిగాడు.

"మా వాళ్ళంతా డిగ్నిఫైడ్ గా చదువుకున్నవారు" అన్నాను.

"ఇంట్లో ఉండటం డిగ్నిటియా?" అన్నాడు. (దేశంలో ఉద్యోగం చేస్తున్నవారికీ,  చదువుకుని, పని చేసే వయసొచ్చి కూడా ఖాళీగా ఉండే నిరుద్యోగులకీ మధ్య నిష్పత్తిని 'నిరుద్యోగ సూచిక' అంటారు. ప్రపంచంలోకెల్లా సౌభాగ్యవంతమయిన ఖతర్-దేశంలో రెండొందలమందికి ఒక నిరుద్యోగి ఉంటే, బీద జింబాబ్వేలో నూటికి ఎనభై ఉన్నారు. నా గెస్ట్‌ది వియత్నాం..! అది యుద్ధాల దేశం. ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయినా అక్కడి అనెంప్లాయ్‌మెంట్  ఇండెక్స్ కేవలం మూడు శాతం మాత్రమే. భారతదేశంలో నూటికి ఏడుగురు నిరుద్యోగులు ఉన్నారు.)




అతని మాటల్లో వెటకారం ఏమయినా ఉన్నదేమో అని చూశాను కాని అలాంటిదేమీ కనపడలేదు."వాళ్ళు ఇళ్ళల్లో వుండరు. సిటిలో కంప్యూటర్ ప్రాక్టీసో, సివిల్స్‌కి ట్రైనింగో పొందుతూ వుంటారు" అన్నాను. అతడు సాలోచనగా "చిన్న ఉద్యోగం చేస్తూ కూడా ఆ ట్రైనింగ్ పొందవచ్చుగా" అన్నాడు. నా దగ్గర సమాధానం లేదు. ఒక వయసు వచ్చాక కూడా మరొకరి మీద ఆధారపడటం ఆత్మన్యూనతా భావాన్ని పెంచుతుంది. మనం ఏ రంగానికి సరిపోతామో, ఏ ఉద్యోగంలో నిలదొక్కుకో  గలుగుతామో ఎవరు ముందే చెప్పగలరు? ముందు ఉద్యోగంలో చేరండి. లేదా మీరే సొంతంగా ఏదైనా వృత్తి ప్రారంభించండి. ఆ తరువాత మీకు కావలసిన రంగంలోకి ప్రవేశించటానికి ప్రయత్నం చేయవచ్చు. ప్రయాణం చెయ్యదలచుకుంటే ట్రైన్ ఎక్కాలి. మంచి ట్రైన్ వచ్చేవరకూ ఎక్కనివాడు జీవితాంతం ప్లాట్‌ఫారం మీదే ఉండిపోతాడు.

**రాజేష్, విజయనగరం:**

**నా వయసు 21. ఎంసీఏ చేస్తున్నాను. నిజానికి నాకు మీడియా రంగంలోకి వెళ్లాలని ఉంది. కానీ కుటుంబ సమస్యల కారణంగా, త్వరగా సెటిలైతే మంచిదని అందరూ బలవంతపెట్టడంతో ఎంసీఏలో చేరాను. కానీ చదువు ఎక్కడం లేదు. ఆసక్తి కలగడం లేదు. మానేయాలని ఉంది. కానీ మరో మంచి రంగంలో సెటిలైతేనే ఇది మానేసినా మావాళ్లు ఏమీ అనరు. పీజీ చేస్తూ మీడియాలో సెటిలయ్యే మార్గం ఉంటే చెప్పండి.**

ఇష్టంలేని చదువుకన్నా నరకం ఇంకొకటి ఉండదు. కానీ మీ వాళ్ళు చెప్పింది కూడా నిజమే కదా. మీడియారంగంలో ఒక స్థాయి వచ్చేవరకూ ఆర్థికంగా నిలదొక్కుకోవటం కష్టం. అన్నిటికన్నా ముందు కొన్ని విషయాల్లో ఒక ఖచ్చితమయిన నిర్ధారణకు రండి.

1. మీరు ఏ మీడియాలో స్థిరపడాలనుకుంటున్నారు? పత్రికారంగమా? టి.వి యా?
2. పత్రికా రంగం అయితే తెలుగా? ఇంగ్లీషా?

3. ఆ రచనా రంగంలో భాషాప్రవేశం ఉన్నాదా? కేవలం ఉత్సాహమేనా?

4. టి.వి. ఛానెల్స్ లో అయితే, కెమేరా ముందా? రిపోర్టింగ్ సైడా?

మీ అభిరుచి కెమేరా ముందయితే... ఉచ్ఛారణ, అందం అవసరం. విజయనగరంలో అవకాశాలు కాస్త కష్టమే. విశాఖపట్నం రామానాయుడు గారి స్టూడియోలో ప్రయత్నం చెయ్యండి. లేదా లోకల్ చానల్స్ లో అడుగు పెట్టండి. మీ కోరిక రిపోర్టింగ్ అయితే... భాష, అవగాహన అవసరం.  ఈనాడు లాంటి పత్రికలు జర్నలిస్టుల కోసం పరీక్షలు నిర్వహించి, ట్రైనింగ్ ఇస్తాయి. ఆ సమయంలో స్టైఫండు కూడా ఇస్తాయి. అయితే, వారు నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులు కావలసి ఉంటుంది. ఏ వృత్తిలో రాణించాలన్నా, కేవలం ఇష్టమే కాదు. అర్హత, కృషి, నైపుణ్యమూ కూడా కావాలి. అభిరుచిగా ప్రారంభించి వృత్తిగా మార్చుకోండి.

తమ వృత్తి చేసుకుంటూ సైడుగా పత్రికా రిపోర్టింగ్ చేస్తున్న ఎల్.ఐ.సి. ఏజెంట్లు, ఉపాధ్యాయులూ కోకొల్లలు. ఆ విధంగా ముందు మీరు కూడా ఆర్థికంగా నిలదొక్కుకోండి. మీడియాలో పని చేస్తూనే ప్రయివేటుగా పోస్ట్-గ్రాడ్యుయేషన్ చెయ్య వచ్చు కదా. లేదా జర్నలిజం కోర్సులో జాయినవ్వండి. ముందే చెప్పినట్టు, దేనికైనా... కేవలం అభిలాష ఉంటే సరిపోదు. కృషి కూడా ఉండాలి. మీ ప్రశ్నకి ముందు ప్రశ్న (షేక్ పషావాలి) కి ఇచ్చిన సమాధానంలో ఆఖరి వాక్యం చదవండి.

**రాకేశ్, నెల్లూరు:**

**నేను బీఎస్సీ కంప్యూటర్స్ చేశాను. నా వయసు 23 ఏళ్లు. డిగ్రీ తర్వాత రెండేళ్లుగా ఆక్వ ఫార్మ్‌లో అకౌంట్స్ చూస్తున్నాను.  కారణం మా ఇంట్లో వాళ్లు షాప్ వాళలకి అప్పు ఉండటం. అది ఇప్పుడు తీరిపోయింది. నాకు మార్కెటింగ్‌లో జాబ్ వచ్చింది. మంచి జీతం. చేయగలనన్న నమమక్ం నాకుంది. అయితే, మా ఇంట్లో వాళ్లకి ఇది ఇష్టం లేదు. షాప్‌లోనే పని చేయమని పోరు పెడుతున్నారు. ఎంత చెప్పినా వినడం లేదు. ఇన్నాళ్లూ వాళలకి నచ్చినట్లు ఉన్నాను. ఇక నుంచైనా నాకు నచ్చినట్లు ఉండాలను కుంటున్నాను. వాళ్లు మాత్రం 'నువ్వు మా కంట్రోల్‌లోనే ఉండాలి. బయటకు వెళితే మా మాట వినవు' అంటున్నారు. జీవితంలో ఇలా బతకాల్సిందేనా? ఏం చేయాలో మీరే సలహా ఇవ్వండి.**

ఒక చక్కటి సాయంత్రం మీరొక నావలో వ్యాహ్యాళి  వెళ్తున్నారనుకుందాం. మీతో పాటూ కుళ్ళిన శవం ఒకటి ప్రవాహంతో పాటూ వస్తోంది. భరించలేని దుర్గంధంతో ఉన్న ఆ శవం నుంచి దూరంగా వెళ్దామనుకున్నారు. ప్రవాహవేగంతో పాటూ వేగంగా ముందుకు పోతారా? ఎదురు తెడ్డు వేసుకుంటూ వెనక్కి పయనిస్తారా? ఏది ఎక్కువ శ్రమతో కూడిన వ్యవహారం? ఈ ప్రశ్నకి రోవింగ్‌లో ఎంతో అనుభవం ఉన్నవారూ, నీటి మీద తరచు ప్రయాణాలు చేసే వారు కూడా, వేగంగా... ప్రవాహంతో పాటూ ముందుకు వెళ్ళి పోవటమే మంచిదని అంటారు.



విజ్ఞులు మాత్రం, ముందుకి వెళ్ళినా, వెనక్కి వెళ్ళినా ఒకే శ్రమ అంటారు. నీటికి ఎదురు తెడ్డు వేసుకుంటూ వెళ్ళాలంటే రెట్టింపు బలం అవసరం. చిత్రమేమింటంటే ముందుకు వెళ్ళాలన్నా 'రెట్టింపు శ్రమతోనే' తెడ్డు వెయాలి. ఎందుకంటే ప్రవాహశక్తి శవానికీ, పడవకీ ఒకటే కాబట్టి, ప్రవాహ వేగంతో శవంకూడా మనతో ప్రయాణం చేస్తోంది కాబట్టి,..!

అది తెలుసుకోవటమే విజ్ఞత. మరేం చెయ్యాలి? చుక్కాని ఉంటే, కాస్త దిశ మార్చి పట్టుకోవాలి. తెరచాప ఉంటే గాలి వాటం చూసుకోవాలి. అప్పుడు ప్రవాహమే మనల్ని దుర్గంధానికి దూరంగా తీసుకు వెళ్తుంది. ఇదే జీవిత సూత్రం. ఈ సూత్రం తెలియని వారు దుర్గంధంతో పాటూ పయనిస్తూ, తెడ్డు ఎంత వేగంగా వేసినా ఫలితం రాలేదేమిటా అని వాపోతారు.

అదే షాపులో పని కొనసాగించమని మీ పెద్దలు ఎందుకు చెపుతున్నారు? అప్పు తీరిపోయింది కదా. దాని వల్ల వారికి గానీ, మీకు గానీ ఏమి లాభం? మంచి ఉద్యోగం వచ్చిందంటున్నారు. వారు ఎందుకు అడ్డు పడుతున్నారు? కొత్త ఉద్యోగం అంటే వారి నుంచి మీరు దూరంగా వెళ్ళాలా? అది వారికి ఇష్టం లేదా? మార్కెటింగ్ అంటే బాగా తిరగాలా? అది మీ ఆరోగ్యం పై ప్రభావాం చూపిస్తుందని వారి భయమా?

ఇంట్లోవారికి మనపై ఉండే ప్రేమలో ఏ మాత్రం సందేహం అక్కర్లేదు. కానీ వారిచ్చే సలహాలు కేవలం ప్రేమతో కూడుకున్నవా? తర్కంతో కూడుకున్నవా అన్నది మనం ఆలోచించుకోవాలి. ఆఫ్టాల్ మన జీవితం మనది కదా. అయితే, మీ పెద్దవాళ్ళు ఎందుకు వద్దు అంటున్నారో క్లియర్‌గా తెలుసుకోండి. మీ వాదనలు వినిపించండి. వారి వాదనలు వినండి. అప్పుడు లాభ నష్టాలు బేరీజు వేసుకుని మీ నిర్ణయంతో వారిని ప్రభావితం చెయ్యండి. మీరు కరెక్టుగా ఆలోచించి, మీ శక్తి నిరూపిస్తే మీ మీద మీవారికి నమ్మకం కలుగుతుంది. ఊరికే వాదిస్తే లాభం ఏమిటి?

### నందు, కాకినాడ:

**నేను డిగ్రీ చదివాను. పోలీస్ అవ్వాలన్నది నా లక్ష్యం. కానిస్టేబుల్ పరీక్ష రాసి సెలెక్ట్ అయ్యాను. ట్రెయినింగ్ కూడా వెళ్లాను. మెడికల్ టెస్ట్ జరిగినప్పుడు నాకు కిడ్నీ సమస్య ఉందని రిజెక్ట్ చేశారు. చాలా బాధేసింది. ట్రీట్ మెంట్ తీసుకున్నాను. కానీ ఎక్కువ కష్టపడకూడదని డాక్టర్స్ అంటున్నారు. దాంతో ఇక పోలీస్ అవ్వలేనని అర్థమైంది. నా లక్ష్యం దెబ్బ తినేసింది. నేనది తట్టుకోలేకపోతున్నాను. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఏడేళ్లుగా ఇదే పరిస్థితి. ఏం చేయమంటారు?**

అద్భుతంగా ఆపరేషన్లు చేసే డాక్టరుకి అకస్మాత్తుగా నరాలు వణికే వ్యాధి వస్తే ఏంచేస్తాడు? ఒక గమ్యం చేరటం అసాధ్యమని తెలిసినప్పుడు, గమ్యాన్ని మార్చుకోవటం తప్ప మరో మార్గం ఏమున్నది? పోలీసు ఉద్యోగంలో మీకు ఏ ఆకర్షణ కనపడిందో, అవే లక్షణాలున్న మరో వృత్తి ఎన్నుకోండి. బాధపడుతూ కూర్చుంటే వయసు పైబడిపోతుంది కదా.

ఒకరు స్నేహితుడిని డిన్నర్కి పిలిచి, తిరిగి వెళ్తూండగా టార్చిలైట్ ఇచ్చాడట. "ఇదెందుకు? నాకు రాత్రిళ్ళు కళ్ళు కనపడవు కదా" అంటూ ఆ స్నేహితుడు బాధపడ్డా డు. "ఇది నీకోసం కాదు మిత్రమా! ఎదుటి వ్యక్తి నిన్ను గుర్తించటానికి..." అన్నాడు హోస్టు. అతిథి వీధిలో వెళ్తూ వుండగా ఒక సైకిలిస్టు వచ్చి ఢీ కొన్నాడు.



"చేతిలో టార్చి కనపడటంలేదా? నేను గుడ్డివాడిని " అని అతడు కోపంగా అరిచాడు. ఆ మాటలకి కన్‌ఫ్యూజ్ అయిన సైకిలిస్టు "అయ్యో! క్షమించండి. కానీ... మీరు టార్చి ఆన్ చెయ్యలేదు" అన్నాడట. ప్రతీ మనిషిలోనూ ఒక టార్చి వుంటుంది. తనలోని టార్చిలైటుని వెలిగించి, తన గమ్యాల్ని గుర్తించటమే ఆత్మపరిశీలన. (***లోయనుంచి శిఖరానికి***).

## సురేంద్ర కుమార్, బెంగలూరు:

**నా స్నేహితురాలికి 35 యేళ్లు. తనకు పెళ్లి మీద మంచి అభిప్రాయం లేదు. చాలా సంస్థల్లో పని చేసింది కానీ ఎందులోనూ ఎక్కువ రోజులు స్థిరంగా లేదు. ఆధ్యాత్మిక గురువుగా మారాలి, జరగబోయేది ముందుగా ఊహించి చెప్పాలి, అదే తన లక్ష్యం అని చెబుతోంది. అది సాధ్యం కాదని నాకు తెలుసు. పైగా వాళ్ల కుటుంబం కూడా చాలా కష్టాల్లో ఉంది. తను చక్కగా పెళ్లి చేసుకుని, మంచి వ్యక్తితో సెటిలైతే బాగుంటుందని నా ఆశ. తనను మార్చే మార్గం ఉంటే చెప్పండి.**

సురేంద్ర కుమార్‌గారూ! ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి. ఇతరుల విషయంలో జోక్యం చేసుకోవటం, వాళ్ళు అడక్కపోయినా సలహా చెప్పటం, అవతలవారి జీవన విధానం పట్ల అమితంగా శ్రద్ధ తీసుకోవటం, బాధపడటం... ఇవన్నీ ఆరోగ్యకరమైన లక్షణాలు కావు. ఆధ్యాత్మిక గురువుగా మారి, అమాయక ప్రజలకు జరగబోయే భవిష్యత్తు ముందుగా ఊహించి చెప్పి, లక్షలూ కోట్లూ సంపాదించాలన్నది ఆమె ఆలోచన అయితే, అది సాధ్యం కాదని ఇప్పుడే మీరు ఎలా చెప్పగలరు. 'పెళ్ళి చేసుకోవటం చక్కగా ఉంటుందని' మీరు ఏ అనుభవంతో చెప్పారో అర్థం కావట్లేదు. తనని మార్చే ఆలోచన మానుకుని, మీరు మారటమే మంచిదని నా ఉద్దేశ్యం.

## వృత్తి–ప్రవృత్తి

## అమూల్యఅంజలి:

**నేను ఇటీవలే ఇంటర్ బైపీసీ పాస్ అయ్యాను. మా పేరెంట్స్ ఇదద్రూ డాకటర్లే. నాకు ఎంబీబీఎస్‌లో చేరాలని లేదు. క్రియేటివ్‌గా ఏదైనా చేయాలని ఉంది. ఏదైనా ప్రాక్టికల్‌గా నేర్చుకోవడమే నాకు ఇష్టం. ఎంబీబీఎస్ నాకు తగిన కోర్సు కాదని అనుకుంటున్నాను. అలాగని, ఏ కోర్సులో చేరితే రాణించగలనో అనే దానిపై ఇంకా ఒక సఫ్షష్టత్‌కు రాలేకపోతున్నాను. దయచేసి సలహా ఇవ్వండి.**

'ప్రాక్టికల్‌గా నేర్చుకోవటం' అంటూ వ్రాసిన మీ ఉత్తరం అస్పష్టంగా ఉంది. మెడిసిన్‌లో ప్రాక్టికాలిటీ గానీ, మెడికల్ రిసెర్చ్‌లో క్రియేటివిటీ గానీ లేవని ఎలా అనుకుంటున్నారు? మీకు మరో రకమైన రిసెర్చ్ కావాలనుకుంటే ఫార్మసీలో గానీ, అగ్రికల్చర్ రంగంలో గానీ చేరండి. మీ ఉద్దేశ్యంలో క్రియేటివ్ అనేది 'రచన' గానీ, 'చిత్రలేఖనం' లాంటిదే అయితే, ఆ విషయం మీ పేరెంట్స్ తో వివరంగా చర్చించండి.

**(కొనసాగింపు వచ్చేనెల)**